


## వైటీసీ సమీపంలో చెక్‌పోస్టు

**సీతంపేట:** ఎన్నికల నేపథ్యంలో సీతంపేట వైటీసీ సమీపంలో గురువారం చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. దీనిని పాలకొండ డీఎస్పీ కృష్ణారావు పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలిచ్చారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి వాహనాన్నీ క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. సారా, మద్యం, నగదు, ఇతర వస్తువుల అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. సరైన రశీదులు, పత్రాలు చూపించకుంటే వాటిని సీజ్ చేయాలని సూచించారు. ఈ పరిశీలనలో సీఐ చంద్రమౌళి, ఎస్ఐ జగదీష్‌నాయుడు తదితరులున్నారు.

# జగనన్న.. సన్నబియ్యం ఏవీ?








- హామీని అటకెక్కించిన వైసీపీ సర్కారు
- ఆ స్థానంలో ఫోర్టిఫైడ్ రైస్ పంపిణీ చేస్తున్నట్లు గొప్పలు
- కొన్ని నెలలుగా కిలో రూపాయి బియ్యమూ అందించని ప్రభుత్వం
- కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ఉచిత బియ్యం తమవిగా ప్రచారం
- కందిపప్పునూ సక్రమంగా పంపిణీ చేయని వైనం
- ఇంటింటికీ రేషన్ ఒట్టిమాటే..
- ఎండీయూ వాహనాలతో వీధి చివర తప్పని నిరీక్షణ

కార్డుదారులకు బియ్యం పంపిణీ చేస్తున్న దృశ్యం (ఫైల్)

(పార్వతీపురం- ఆంధ్రజ్యోతి)

'దేవుని దయ వల్ల అధికారంలోకి వస్తే.. నాణ్యమైన సన్నబియ్యాన్ని ఐదు, పది కిలోల సంచుల్లో నింపి.. రేషన్ కార్డుదారులందరికీ ఇళ్లకే అందిస్తాం..' అని గత ఎన్నికల సమయంలో సీఎం జగన్ హామీ ఇచ్చారు. అయితే పాలనా పగ్గాలు చేపట్టిన తర్వాత ఆ హామీని అటకెక్కించారు. వాటి స్థానంలో ఫోర్టిఫైడ్ బియ్యాన్ని పంపిణీ చేస్తున్నట్లు గొప్పలు చెప్పుకున్నారు. అయితే వాటిని కూడా కార్డుదారులకు పూర్తిస్థాయిలో అందించడం లేదు. దీంతో జిల్లావాసులు పెదవి విరుస్తున్నారు. కొన్ని నెలలుగా కిలో రూపాయి బియ్యాన్ని వైసీపీ సర్కారు అందించడం లేదు. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న ఉచిత బియ్యాన్నే కార్డుదారులకు పంపిణీ చేస్తూ.. రాష్ట్ర ప్రభుత్వమే అందిస్తున్నట్లుగా వైసీపీ ప్రచారం చేసుకుంటోంది. మరోవైపు ఎక్కడా లేని విధంగా ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటికీ రేషన్ బియ్యం అందిస్తున్నట్లు రాష్ట్ర సర్కారు చెప్పుకుంటున్నా.. వీధి చివర కార్డుదారులకు మాత్రం గంట తరబడి నిరీక్షణ తప్పడం లేదు. సరుకుల కోసం పనులన్నీ మానుకుని.. క్యూలైన్‌లో బారులుదీరాల్సి వస్తోంది. మొత్తంగా వైసీపీ ప్రభుత్వ తీరుపై జిల్లావాసులు పెదవి విరుస్తున్నారు.

### ఇదీ పరిస్థితి..

వాస్తవంగా కేంద్ర ప్రభుత్వం ప్రతి కార్డుదారునికి ఉచితంగా ఐదు కిలోల చొప్పు బియ్యం ఇస్తుండగా,



రాష్ట్ర ప్రభుత్వం కూడా అదేవిధగా అందించాల్సి ఉంది. కానీ కొన్ని నెలలుగా కిలో రూపాయి బియ్యాన్ని వైసీపీ అందించడం లేదు. దీంతో కార్డుదారులకు అందిస్తున్న బియ్యం చాలడం లేదు. ప్రస్తుతం వారు బయట మార్కెట్లో కొనుగోలు చేసుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలోని 2,25,312 రైస్‌కార్డులు ఉండగా 6,64,974 మంది లబ్ధిదారులు ఉన్నారు. ఇవి కాకుండా 15 మండలాల్లో సుమారు 55,935 అంత్యోదయ, ఆవాస్ యోజన కార్డులు ఉన్నాయి. వాటి పరిధిలో 1,70,263 మంది లబ్ధిదారులున్నారు. మొత్తంగా ప్రతినెలా ఆయా కార్డులకు సుమారు 52,83,735 (5,215 మెట్రిక్ టన్నులు) కిలోల బియ్యాన్ని కార్డుదారులకు అందించాల్సి వచ్చింది. వాస్తవంగా కార్డుదారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి రేషన్ బియ్యం పంపిణీ చేయాల్సి ఉంది. అయితే కరోనా కాలం నుంచి కేంద్రం మనిషికి 5 కిలోల చొప్పున ఉచితంగా బియ్యం అందిస్తోంది. అంత్యోదయ, ఆవాస్ యోజన కార్డుల్లో ఎంతమంది కుటుంబ సభ్యులు ఉన్నప్పటికీ 35 కిలోల చొప్పున ఉచితంగా బియ్యాన్ని అందిస్తున్నారు. 2020 నుంచి ఇలా పంపిణీ చేస్తుండగా.. 2023తో నిలిపేస్తామని తొలుత ప్రకటించినా గతేడాది మళ్లీ గడువు పెంచారు. వైసీపీ ప్రభుత్వం కూడా కిలో రూపాయి చొప్పున రైస్ కార్డుల్లో ఉన్న ఒక్కొక్కరికీ ఐదు కిలోల వంతున రేషన్ బియ్యం అందించాల్సి ఉంది. అయితే సుమారు ఏడాదిన్నర నుంచి వాటిని సరఫరా చేయడం లేదు. కేవలం కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఉచిత బియ్యాన్నే కార్డుదారులకు సరఫరా చేస్తూ.. ఇదంతా తమ గొప్పతనమే అన్నట్లుగా రాష్ట్ర సర్కారు ప్రచారం చేసుకుంటోంది. దీనిపై ఫిర్యాదులు వెళ్లినా.. సర్కారు తీరు మారడం లేదు. కార్డుదారులతో రెండు సార్లు థంబ్ వేయించుకుని సరుకులు అందించాల్సి ఉండగా.. అలా ఎక్కడా అమలు చేయడం లేదు. ఒకసారి థంబ్ వేయించి బియ్యం మాత్రమే అందించి పంపిస్తున్నారు. ప్రతినెలా కందిపప్పు, పంచదారను కూడా సక్రమంగా పంపణీ చేయడం లేదు.

### కోతలే కోతలు...

గత ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్, మే నెలల్లో కార్డుదారులకు అందించే కందిపప్పులో కోతలు విధించారు. జూలై నుంచి సరఫరా నిలిపివేసి తిరిగి నవంబరు నెలలో కంది పప్పును అందించారు. ఈ సంవత్సరంలో కందిపప్పు సరఫరాలో కూడా కోత విధించారు. పలుచోట్ల కొన్ని కార్డులకే పంపిణీ చేశారు. మొత్తంగా 644 రేషన్ డిపోల పరిధిలో 196 ఎండీయూ వాహనాల ద్వారా నెలకు 2,81,251 మంది కార్డుదారులకు కిలో రూ.67 చొప్పున కందిపప్పు అందించాల్సి ఉంది. కానీ ఆ పరిస్థితి జిల్లాలో లేదు. పూర్తిస్థాయిలో పంపిణీ చేయకపోవడంతో కార్డుదారులు పెదవి విరుస్తున్నారు. ఈ నెలలో కూడా కందిపప్పు సరఫరా సక్రమంగా అందించలేదని అనేక మంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో కిలో కందిపప్పు ధర రూ.160 పైనే ఉండడంతో అదనంగా తమపై భారం పడుతోందని వాపోతున్నారు. ప్రభుత్వం సరఫరా చేయకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో బయట మార్కెట్లో కొనుగోలు చేసుకోవాల్సి వస్తోందని చెబుతున్నారు. ఎండీయూ వాహనాలను తీసుకొచ్చి.. ప్రజల ఇంటికే రేషన్ అందిస్తున్నామని గొప్పలు చెప్పుకొంటున్న వైసీపీ సర్కారు సరుకుల పంపిణీలో కోత విధించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన మేరకు సన్న బియ్యం ఇవ్వకపోగా.. వాటి స్థానంలో ఫోర్టిఫైడ్ బియ్యాన్ని పంపిణీ చేస్తున్నారు. అది మినహాయిస్తే.. కందిపప్పును కేజీకి కుదించారు. అది కూడా 40 శాతం కార్డుదారులకే పరిమితం చేయగా.. తొమ్మిది నెలలుగా సక్రమంగా సరఫరా చేయడం లేదు. అరకిలో పంచదారను రూ.17కు అందిస్తున్నారు. గోధుమ పిండి అందించి మధ్యలో నిలిపివేశారు. ఉప్పు సరఫరా చేయడం మానేశారు.

### గత టీడీపీ ప్రభుత్వ హయాంలో..

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రేషన్ డిపోల ద్వారా ప్రతి కార్డుకు కిలో రూ.40 చొప్పున రెండు కిలోల కందిపప్పును అందించేవారు. అరకిలో పంచదారను రూ. 10కు ఇచ్చేవారు. బియ్యం వద్దని వారికి మూడు కిలోల జొన్నలు లేదా రాగులు పంపిణీ చేసేవారు. కిలో రూ.16కు గోధుమపిండి , కిలో ఉప్పు రూ. 12 అందించేవారు. పామాయిల్, కారం, పసుపు తదితర నిత్యావసర సరుకులను ప్రతినెలా క్రమం తప్పకుండా పంపిణీ చేశారు. పండగల సమయంలో చంద్ర కానుకల కింద నిత్యావసరాల కిట్లను కూడా అందించేవారు. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చిన వాటికి మంగళం పాడేసింది.

### సక్రమంగా ఇవ్వడం లేదు..

రేషన్ పంపిణీ వాహనాల ద్వారా ప్రతినెలా సక్రమంగా కందిపప్పు ఇవ్వడం లేదు. ఎప్పుడు ఇస్తారో ఎప్పుడు నిలిపివేస్తారో తెలియని పరిస్థితి. గత టీడీపీ ప్రభుత్వ హయాలో సబ్సిడీపై కందిపప్పు సరఫరా చేసేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. పేదలకు ఇచ్చే కందిపప్పులో కూడా వైసీపీ సర్కారు కోతలు విధించడం దారుణం. మా కుటుంబానికి రేషన్ బియ్యం కూడా చాలడం లేదు. దీంతో కిలో రూ.50 చొప్పున బయట కొనుగోలు చేసుకోవల్సి వస్తోంది.

-రమణమ్మ, పాలకొండ

### కొనుగోలు చేయలేకపోతున్నాం..

వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నిత్యావసర సరుకుల ధరలన్నీ అమాంతం పెరిగాయి. బహిరంగ మార్కెట్‌లో కిలో కందిపప్పు ధర రూ.160 నుంచి రూ.170 పైనే పలుకుతుంది. మరోవైపు ఎండీయూ వాహనాల ద్వారా ప్రతినెలా సక్రమంగా కందిపప్పును అందించడం లేదు. దీంతో బయట మార్కెట్లో దానిని కొనుగోలు చేయలేకపోతున్నాం.

-లక్ష్మి, పార్వతీపురం

---

ప్రచార ఖర్చులు

## అభ్యర్థి ఖాతాలోనే..

- వ్యయ పరిశీలకుడు రమాకాంత్ ప్రధాన్

**సీతంపేట:** ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో ఇప్పటి నుంచి ప్రచార ఖర్చులను అభ్యర్థి ఖాతాలో నమోదు చేయాలని అసెంబ్లీ నియోకవర్గ వ్యయ పరిశీలకుడు రమాకాంత్ ప్రధాన్ అన్నారు. గురువారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యయాన్ని ఎలా నమోదు చేస్తున్నారని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులు పరిశీలించి పలు సూచనలు చేశారు. ఎన్నికల నేపథ్యంలో ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. విధుల నిర్వహణలో అలసత్వం పనికిరాదన్నారు. అభ్యర్థుల వ్యయాలపై నిఘాపెట్టి ప్రతి అంశాన్ని రికార్డులో నమోదు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో పాలకొండ నియోజ కవర్గ ఆర్వో కల్పనాకుమారి, వ్యయ పరిశీలన, నోడల్ బృందాలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

---

## ఆ స్థలం మాదే..

- అధికార పార్టీ నాయకురాలి ఆధ్వర్యంలో రోడ్డును తవ్వేస్తున్న వైనం
- అడ్డుకున్న దెబ్బగడ్డ గిరిజనులు
- పదేళ్ల తర్వాత గుర్తుకొచ్చిందా? అంటూ నిలదీత



గత టీడీపీ ప్రభుత్వ హయాంలో వేసిన రహదారిని తవ్వేస్తున్న దృశ్యం

**పార్వతీపురం రూరల్:** సుమారు పదేళ్ల కిందట నిర్మించిన రహదారిని ఓ వైసీపీ నాయకురాలి ఆధ్వర్యంలో తవ్వేస్తున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే.. తమ పొలానికి ఆనుకుని రోడ్డు నిర్మించారని.. ఈ స్థలం తమదేనని చెప్పుకొస్తున్నారు. అయితే దీనిపై ఆయా ప్రాంత గిరిజనులు మాత్రం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు గురువారం రహదారి తవ్వకాలను అడ్డుకుని నిరసన తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. పార్వతీపురం మండలం డీకే పట్నం నుంచి మక్కువ మండలం దెబ్బగడ్డ గిరిజన గ్రామం వరకు 2014లో సుమారు రూ. 49 లక్షలతో ఉపాధి హామీ పథకం కింద నాలుగున్నర కిలోమీటర్ల మేర మట్టి రోడ్డు నిర్మించారు. దీంతో డీకేపట్నంతో పాటు దెబ్బగడ్డ, ఇతర గిరిజన గ్రామాల ప్రజలకు రోడ్డు కష్టాలు తీరాయి. వారి రాకపోకలకు ఎటువంటి ఇబ్బంది ఉండేది కాదు. అయితే తాజాగా డీకే పట్నం గ్రామానికి చెందిన అధికార పార్టీ నాయకురాలి ఆధ్వర్యంలో రోడ్డు విధ్వంసం మొదలైంది. తమ పొలాన్ని కలుపుకొని అప్పట్లో రహదారి నిర్మించారంటూ సదరు నాయకురాలు ఆరోపిస్తుండగా.. మరోవైపు ఈ నెల 17 నుంచి రోడ్డు తవ్వకం పనులు ప్రారంభించారు. దీంతో దెబ్బగడ్డ గిరిజనులతో పాటు డీకే పట్నానికి చెందిన టీడీపీ నేతలు జి.లక్ష్మణరావు, సాయి రామకృష్ణ తదితరులు గురువారం రోడ్డు తవ్వకాల పనులను అడ్డుకున్నారు. పదేళ్ల తర్వాత ఇప్పుడు ఈ స్థలం గుర్తుకు వచ్చిందా? అని ప్రశ్నించారు. దీనిపై ఐటీడీఏ పీవో విష్ణుచరణ్, గిరిజన ఇంజనీరింగ్ అధికారులు స్పందించాలని ఈ ప్రాంత గిరిజనులు డిమాండ్ చేస్తున్నారు.

### రహదారి తవ్వడం దారుణం

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రహదారి నిర్మించాం. కానీ పదేళ్ల తర్వాత అధికార పార్టీకి చెందిన నాయకురాలు ప్రస్తుతం రహదారిని విధ్వంసం చేయడం దారుణం. 2014లో వేసిన ఈ రహదారి ఈ ప్రాంత గిరిజనులకు ఎంతో ఉపయోగకరగా ఉండేది. దీనిపై ఉన్నతాధికారులు స్పందించాలి.

- జి.లక్ష్మణరావు, సాయి రామకృష్ణ, టీడీపీ ప్రతినిధులు, డీకే పట్నం

---

నామినేషన్ల

## పర్వం మొదలు


- తొలిరోజు కురుపాంలో ఒకటి..
- మిగిలిన చోట్ల నిల్

**పార్వతీపురం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి):** జిల్లాలో నామినేషన్ల పర్వం మొదలైంది. అయితే గురువారం తొలిరోజు టీడీపీతో పాటు వైసీపీ, ఇతర ప్రధాన పార్టీల అభ్యర్థులెవరూ నామినేషన్లు వేయలేదు. కురుపాంలో ఒక స్వతంత్ర అభ్యర్థి నామినేషన్ దాఖలు చేశారు. అది మినహా జిల్లాలో మరెక్కడా నామినేషన్లు పడలేదు. చాలా మంది అభ్యర్థులు మంచి రోజు, జన్మ నక్షత్రం, పేరు ప్రకారం ముహూర్తాలను పెట్టుకున్నారు. శుక్రవారం, శనివారం ఎక్కువ మంది నామినేషన్లు వేసేందుకు అవకాశం ఉంది. కాగా కలెక్టరేట్‌లో నిశాంత్‌కుమార్, సీతంపేట ఐటీడీఏలో పాలకొండ ఆర్వో కల్పనాకుమారి, సాలూరు, పార్వతీపురం, కురుపాం నియోజకవర్గాల్లో ఆయా ఆర్వోలు సి. విష్ణుచరణ్, హేమలత, వెంకటరమణ ఎన్నికల నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. నోటిఫికేషన్ వివరాలను రిటర్నింగ్ కార్యాలయ నోటీసు బోర్డులో పెట్టారు.

---

# వైసీపీ వారి చార్జీల మోత





- భారంగా మారిన ఆర్టీసీ బస్సు ప్రయాణం
- సామాన్య, మధ్య తరగతి వర్గాలపై తీవ్ర ప్రభావం
- మరోవైపు కాలం చెల్లిన బస్సులతోనే నెట్టుకొస్తున్న వైనం
- ప్రయాణికుల అసంతృప్తి.. అధికార పార్టీపై ఆగ్రహం

**పార్వతీపురం టౌన్, ఏప్రిల్ 18 :** వైసీపీ ప్రభుత్వ పాలనలో ప్రజలకు ప్రయాణం కూడా భారంగా మారింది. ఐదేళ్ల కాలంలో పలు ధపాలు ఆర్టీసీ బస్సు చార్జీలను పెంచేయడంతో జిల్లావాసులు మండిపడుతున్నారు. మరోవైపు కాలం చెల్లిన బస్సులనే ఇప్పటికీనడిపిస్తుండడంతో ప్రయాణికులు మండిపడుతున్నారు. మొత్తంగా బస్సు ఎక్కాలంటేనే సామాన్య, మధ్యతరగతి వర్గాలు భయాందోళన చెందుతున్నారు. వాస్తవంగా జిల్లాలోని సాలూరు, పార్వతీపురం, పాలకొండలో ఆర్టీసీ డిపోలున్నాయి. వాటి పరిధిలో 72 అద్దె ప్రాతిపదికన, 162 వరకు ఆర్టీసీ ఓన్ బస్సులు నడుస్తున్నాయి. అయితే 2019 తో పోలిస్తే పల్లె వెలుగు, అల్ట్రా , ఎక్స్‌ప్రెస్ బస్సు చార్జీలు 15 శాతం వరకు పెరిగాయి. అయితే వైసీపీ అధికారంలో వచ్చిన తర్వాత 2022, జూలైలో బస్సు చార్జీలు పెంచింది. దీంతో సుదూర ప్రాంతాల వారితో పాటు 10 కిలో మీటర్ల లోపు ప్రజల పైనా అదనపు భారం పడింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పార్వతీపురం నుంచి విజయనగరం జిల్లా కేంద్రానికి గాను పల్లె వెలుగు బస్సు చార్జీ రూ. 80 ఉండేది. అదే వైసీపీ ప్రభుత్వ పాలనలో ఆ బస్సు చార్జి రూ. 90కు పెరిగింది. ఎక్స్‌ప్రెస్ చార్జీ రూ. 105 నుంచి రూ. 115కు పెరిగింది. జిల్లాకేంద్రం నుంచి విశాఖకు ఎక్స్‌ప్రెస్ బస్సు చార్జి రూ.160ల నుంచి రూ.180కు పెంచారు. అల్ట్రా డీలక్స్ అయితే రూ.195 నుంచి రూ.220క వరకు వసూలు చేస్తున్నారు. దీంతో ప్రయాణికులు బెంబేలెత్తిపోతున్నారు. పొరుగు రాష్ట్రం ఒడిశాలోనూ ఈ విధంగా బస్సు చార్జీలు లేవంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పార్వతీపురం ఆర్టీసీ డిపో నుంచి రోజూ విశాఖ, విజయనగరం, పాలకొండ, సాలూరు, గుమ్మలక్ష్మీపురం, బొబ్బిలి తదితర ప్రాంతాలకు 87 బస్సులు నడుపుతున్నారు. వాటిల్లో పల్లెవెలుగు, అల్ట్రా , ఎక్స్‌ప్రెస్ బస్సులున్నాయి. కాగా నిత్యం వాటి ద్వారా డిపోకు రూ. 13 లక్షల నుంచి రూ. 14 లక్షల వరకు వస్తోంది. కాగా టీడీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లలో ఆర్టీసీ చార్జీలను పెంచలేదు. 2019 అనంతరం వైసీపీ పాలన పగ్గాలు చేపట్టిన తర్వాత ఆర్టీసీ చార్జీలను పెంచేయడంతో ఆ ప్రభావం అన్ని రంగాలపైనా పడింది. ప్రధానంగా నిత్యావసర సరుకుల ధరలు నింగినంటగా.. పేద, మధ్యతరగతి ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఏమి కొనలేని .. తినలేని పరిస్థితి ఏర్పడిగా.. కనీసం బస్సుల్లో కూడా వారు ప్రయాణాలు కూడా చేయలేకపోతున్నారు. ఈ విషయమై జిల్లా ప్రజా రవాణాధికారి సుధాకర్‌ను వివరణ కోరగా.. ఎన్నికల నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆర్టీసీ సంస్థకు సంబంధించి ఎటువంటి సమాచారాన్ని ఇవ్వకూడదని తెలిపారు.



పార్వతీపురం కాంప్లెక్స్ వద్ద బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు

### బస్సుల్లో ప్రయాణం కష్టమే..

ఆర్టీసీ బస్సుల్లో విజయనగరం, విశాఖకు ప్రయాణించాలంటే కష్టమే.. ఎందుకంటే ఆయా ప్రాంతాలకు రూ.110 నుంచి రూ.200 వరకు చెల్లించాల్సి వస్తోంది. అదే రైళ్లలో అయితే రూ.20 నుంచి రూ.60 లోపు చార్జీలతో ఆయా ప్రాంతాలకు వెళ్లిపోతున్నాం. కానీ సకాలంలో రైళ్లు నడవకపోవడం వల్ల బస్సులను ఆశ్రయించాల్సి వస్తోంది. అయితే చార్జీలు అమాంతం పెంచేయడం వల్ల బస్సులో ప్రయాణమంటే అధిక మొత్తంలో చెల్లించాల్సి వస్తోంది. ఇది మాలాంటి వారికి భారంగా మారింది.

- తేజ, ప్రయాణికుడు, పార్వతీపురం

### ఎంతవరకు సమంజసం

ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సుఖం, సురక్షితం అన్నది ఒకప్పటి మాట. కాలం చెల్లిన బస్సుల్లో ప్రయాణం చేయలేకపోతున్నాం. ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందో తెలియని పరిస్థితి. ఎన్నో పనులపై నిత్యం సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తుంటారు. అయితే వైసీపీ సర్కారు దానిని పట్టించుకోకుండా బస్సు చార్జీలను పెంచేయడం ఎంతవరకు సమంజసం.

- సింహాచలం, ప్రయాణికుడు, ఎర్రసామంతవలస

(రాజాం)

రాజాం... నిన్న మొన్నటి వరకు శ్రీకాకుళం జిల్లాలో ఉన్న ఈ నియోజకవర్గం.. ఇప్పుడు విజయనగరం జిల్లాలో చేరింది. పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందింది. రాజకీయ యుద్ధాలకు పేరుమోసీన ప్రాంతం. పూర్వాశ్రమంలో ఉణుకూరు నియోజకవర్గంగా ఉండేది. 2009లో పునర్విభజనతో రాజాం నియోజకవర్గంగా అవతరించింది. జనరల్ స్థానం కాస్తా ఎస్సీ కావడంతో రెండు కుటుంబాల మధ్య రాజకీయ యుద్ధానికి తెరపడింది.

# రాజాం..

● ఒకప్పుడు ఉణుకూరు.. ● టీడీపీ ఆవిర్భావం తరువాత ఆరు ఎన్నికలు ● అందులో ఐదుసార్లు గెలిచింది తెలుగుదేశమే

● నాలుగుసార్లు సత్తా చాటిన కళా వెంకటరావు ● 2009లో రాజాం ఆవిర్భావం ● ఒకసారి కాంగ్రెస్... రెండుసార్లు వైసీపీ విజయం

రాజాం నియోజకవర్గ ముఖచిత్రం

# ఏమిటో ఓటరు మనోగతం!

### అప్పట్లో ఉణుకూరుగా...

ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో ఉణుకూరు నియోజకవర్గం ఉండేది. 1952లో ఈ నియోజకవర్గం ఆవిర్భవించింది. రాజాం, వంగర మండలాలతో పాటు రేగిడి ఆమదాలవలస మండలంలోని 22 పంచాయతీలతో ఉణుకూరు నియోజకవర్గం సాగేది. ఈ నియోజకవర్గంలో దశాబ్దాలుగా పాలవలస కుటుంబం హవా నడిచింది. ఆ కుటుంబానికి చెందిన పాలవలస రుక్మిణమ్మ, సంగంనాయుడు, రాజశేఖరం కాంగ్రెస్ పార్టీ తరుపున గెలుపొందుతూ వచ్చారు. కానీ 1983లో టీడీపీ ఆవిర్భావంతో పాలవలస కుటుంబానికి చెక్ పెట్టారు కళా వెంకటరావు. రెండున్నర పదుల వయసులో టీడీపీ అభ్యర్థిగా తెరపైకి వచ్చారు కళా వెంకటరావు. కిమిడి వెంకటరావుకు ఎన్టీఆర్ 'కళా' అనే బిరుదును జోడించారు. అప్పటి నుంచి కిమిడి కళా వెంకటరావుగా పేరొందారు. 1983, 1985, 1989 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి కళా వెంకటరావు హ్యాట్రిక్ విజయం సాధించారు. 1994లో మాత్రం పాలవలస రాజశేఖరం చేతిలో ఓడిపోయారు. ఆ ఎన్నికల్లో ఉత్తరాంధ్రలో ఒక్క ఉణుకూరు తప్ప అన్ని స్థానాలను టీడీపీ గెలుచుకుంది. కాంగ్రెస్ పార్టీ తరఫున పాలవలస రాజశేఖరం ఒక్కరే గెలిచారు. ఈ నేపథ్యంలో 1997లో కళా వెంకటరావు టీడీపీ తరఫున రాజ్యసభ సభ్యుడయ్యారు. దీంతో 1999లో ఉణుకూరు నియోజకవర్గం నుంచి కళా వెంకటరావు సోదరుడు కిమిడి గణపతిరావు టీడీపీ అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందారు. 2004లో మరోసారి కళా వెంకటరావు టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. 2009లో నియోజకవర్గాల పునర్విభజనతో ఉణుకూరు కనుమరుగైంది. రాజాం నియోజకవర్గం తెరపైకి వచ్చింది. ఎస్సీలకు రిజర్వ్ కావడంతో కళా వెంకటరావు నియోజకవర్గం మారాల్సిన అనివార్య పరిస్థితి ఎదురైంది. టీడీపీ ఆవిర్భావం తరువాత 2004 వరకూ ఆరు ఎన్నికలు జరుగగా.. ఐదుసార్లు టీడీపీ గెలవడం... అందులో నాలుగుసార్లు కళా వెంకటరావు గెలవడం విశేషం.

### మార్పు ఎవరికి వరమో...

ఈసారి ఎన్నికల్లో వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే కంబాల జోగులును తప్పించింది. విశాఖ జిల్లా పాయకరావుపేటకు పంపించింది. ఇక్కడ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే తలే భద్రయ్య కుమారుడు డాక్టర్ రాజేష్‌ను బరిలో దించింది. టీడీపీ మాత్రం మాజీ మంత్రి కోండ్రు మురళీమోహన్‌కు మరోసారి టిక్కెట్ కేటాయించింది. నియోజకవర్గాల పునర్విభజన అనంతరం మూడుసార్లు జరిగిన ఎన్నికల్లో టీడీపీకి విజయం దక్కలేదు. అందుకే ఈ ఎన్నికల్లో ఆ పార్టీ సర్వశక్తులు ఒడ్డుతోంది. ఈసారి ఓటరు ఎవరిపై తమ అభిమానాన్ని చూపిస్తారో చూడాలి.



రాజాం నియోజకవర్గ కేంద్రం



కళా వెంకటరావు



పాలవలస రాజశేఖరం



కోండ్రు మురళీ మోహన్



కిమిడి గణపతిరావు



కంబాల జోగులు



కావలి ప్రతిభా భారతి

**ఓటర్ల వివరాలు..**

| | |
|---|---|
| మొత్తం ఓటర్ల సంఖ్య: | 2,24,227 |
| పురుషులు: | 1,11253 |
| మహిళలు : | 1,11,253 |
| థర్డ్ జెండర్ : | 19 |



పోలిపల్లి పైడితల్లి అమ్మవారు

రాజాం నియోజకవర్గం మ్యాప్



రాజాం పట్టణంలోని ఎర్రచెరువు

### రాజాం ఇలా...

2009లో ఆవిర్భవించిన రాజాం నియోజకవర్గం ఎస్సీలకు రిజర్వ్ అయ్యింది. అదే సమయంలో ఎస్సీ నియోజకవర్గంగా ఉన్న ఎచ్చెర్ల జనరల్‌గా మారింది. దీంతో అక్కడి నాయకులు ఇక్కడికి... ఇక్కడి నాయకులు అక్కడికి వెళ్లాల్సి వచ్చింది. 2009లో కాంగ్రెస్ అభ్యర్థిగా కోండ్రు మురళీమోహన్ పోటీచేశారు. టీడీపీ అభ్యర్థి కావలి ప్రతిభాభారతిపై 27,133 ఓట్లతో విజయం సాధించారు. 2014లో వైసీపీ అభ్యర్థిగా కంబాల జోగులు పోటీచేశారు. టీడీపీ అభ్యర్థిగా కావలి ప్రతిభాభారతిపై కేవలం 512 ఓట్లతో మాత్రమే విజయం సాధించారు. 2019 ఎన్నికలకు ముందు కాంగ్రెస్ నుంచి మాజీ మంత్రి కోండ్రు మురళీమోహన్ టీడీపీలో చేరారు. ఆ పార్టీ అభ్యర్థిగా పోటీచేశారు. వైసీపీ అభ్యర్థి కంబాల జోగులు చేతిలో 16,848 ఓట్ల తేడాతో ఓడిపోయారు. పారిశ్రామిక ప్రాంతంగా అభివృద్ధి చెందిన రాజాంలోని పోలిపల్లి పైడితల్లి అమ్మవారి ఆలయం ఉత్తరాంధ్రలోనే ప్రసిద్ధి చెందినది.

## ఎమ్మెల్యేలు ఎంపీలు ఇద్దరు

● ఇదీ జామి మండలం ప్రత్యేకత

**శృంగవరపుకోట:** ఇద్దరు ఎమ్మెల్యేలు... ఇద్దరు ఎంపీలు ప్రాతినిధ్యం వహిస్తున్న మండలం జామి. ఈ మండలంలో శృంగవరపుకోట నియోజకవర్గ పరిధిలో కొన్ని గ్రామాలు... గజపతినగరం నియోజకవర్గ పరిధిలో మరి కొన్ని గ్రామాలు ఉన్నాయి. మొత్తం 25 గ్రామాలు ఉన్నాయి. శృంగవరపుకోట నియోజకవర్గ పరిధిలో 13 గ్రామాలు... జామి, చింతాడ, పావాడ, జాగరం, తానవరం, లక్ష్మీపురం, అలమండ, రామభద్రపురం, జట్టేడివలస, రామయ్యమ్మపాలెం, గొడుకొమ్ము, శిరికివానిపాలెం, కలగాడ ఉన్నాయి. గజపతినగరం నియోజకవర్గ పరిధిలో 12 గ్రామాలు... భీమసింగి, కుమరాం, అట్టాడ, మొకాసు కొత్తవలస, అన్నమురాజుపేట, లొట్లపల్లి, వెన్నె, శాసనపల్లి, వెంకటరాజుపాలెం, జన్నివలస, తాండ్రింగి, విజినిగిరి ఉన్నాయి. శృంగవరపుకోట నియోజకవర్గం విశాఖపట్టణం పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోనూ... గజపతినగరం నియోజకవర్గం విజయనగరం పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోనూ ఉన్నాయి. దీంతో ఇద్దరు ఎంపీలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. దీంతో ఎన్నికలొస్తే ఇద్దరు ఎమ్మెల్యే అభ్యర్థులు... ఇద్దరు ఎంపీ అభ్యర్థుల ప్రచారాలతో ఈ మండలంలో సందడి నెలకొంటుంది.

## నామినేషన్ల దాఖలుకు పటిష్ఠ భద్రత

● పాలకొండ ఆర్వో కల్పనాకుమారి



డీఎస్పీతో చర్చిస్తున్న ఆర్వో కల్పనాకుమారి

**సీతంపేట:** నామినేషన్లు వేసే సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటలు జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని పాలకొండ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కల్పనాకుమారి సూచించారు. ఈ అంశంపై గురువారం తన కార్యాలయంలో పాలకొండ డీఎస్పీ కృష్ణారావుతో చర్చించారు. అభ్యర్థులు నామినేషన్లు వేయడానికి వచ్చే సమయంలో అనుచరులు, కార్యకర్తలు, నాయకులను రిటర్నిగ్ అధికారి కార్యాలయానికి వంద మీటర్ల దూరంలో ఉంచాలన్నారు. ఆర్వో కార్యాలయానికి వంద మీటర్ల దూరంలో బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. ఇదిలా ఉండగా తొలిరోజు గురువారం ఎవరూ నామినేషన్లు వేయలేదని ఆమె తెలిపారు. ఈ నెల 25 వరకు నామినేషన్లు వేసుకోవచ్చని, ప్రతిఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలని సూచించారు. ఈ సమావేశంలో సీఐ చంద్రమౌళి, ఎస్ఐ జగదీష్‌నాయుడు తదితరులు ఉన్నారు.

## డబ్బు తీసుకెళుతున్నారా?

● ఎన్నికల నిబంధనలు మరచిపోవద్దు ● రూ.50వేలకు మించి తీసుకెళ్లకూడదు

● సరైన ఆధారాలు సమర్పించాల్సిందే

**గంట్యాడ:** ఎన్నికల నియమావళి అమలులో ఉన్న నేపథ్యంలో పోలీసులు అన్ని చోట్లా విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారు. వాహనాలతో పాటు ప్రజలు తమతో పాటు తీసుకెళ్తున్న బ్యాగులు, ఇతర వస్తువులు సైతం పరిశీలిస్తున్నారు. సరైన ఆధారాలు లేకుండా ఎవరైనా రూ.50 వేలకు మించి నగదు తీసుకువెళ్తే స్వాధీనం చేసుకుంటారు. కొన్నిసార్లు సొంత పనుల మీద ఇతర ప్రాంతాలకు నగదు తీసుకువెళ్తున్నా ఇబ్బందులు తప్పవు. ఎన్నికల నియమ నిబంధనల మేరకు తగిన ఆధారాలతో అధిక మొత్తంలో నగదు తీసుకుని వెళ్లవచ్చు.



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు(ఫైల్)

### ఫైనాన్స్..చిట్టీల వ్యాపారం

చిట్టీల, ఫైనాన్స్ సంస్థల్లో నిత్యం భారీగా లావాదేవీలు జరుగుతాయి. కలెక్షన్ ఏజెంట్ల వద్ద రూ.లక్షల్లో నగదు ఉంటుంది. వీరు ఆ రోజు చేసిన కలెక్షన్ పద్దులు, బాకీ ఉన్న నగదు.. వసూలైన మొత్తం.. ఇలా అన్ని వివరాలతో పాటు కస్టమర్ల సంతకంతో కూడిన ప్రతులను తప్పనిసరిగా తమ వెంట ఉంచుకోవాలి.

### బంగారు ఆభరణాల కొనుగోలులో...

శుభకార్యాలు నిర్వహించే సమయంలో బంగారు, ఇతర వస్తువుల కొనుగోలుకు నగదు తీసుకు వెళతారు. శుభకార్యాల కోసం నగదు తీసుకువెళ్లే వారు తమ వెంట శుభలేఖ ఉంచుకోవాలి. అదే విధంగా పోలీసులు అడిగిన అన్ని వివరాలకు పూర్తిగా సమచారం ఇవ్వాలి.

### బ్యాంకు లావాదేవీలకు...

బ్యాంకు లావాదేవీలు రూ.50 వేలు మించితే ఆధారాలు చూపించాలి. చెక్కు ద్వారా నగదు విత్ డ్రా చేస్తే చెక్కు జెరాక్స్, పాస్ బుక్ ఉంచుకోవాలి. ఏటీఎం ద్వారా నగదు విత్ డ్రా చేస్తే ఏటీఎం స్లిప్‌లు జాగ్రత్త చేయాలి. ఒక వేళ నగదు బ్యాంకులో డిపాజిట్ చేసేందుకు వెళితే.. సంబంధిత అన్ని వివరాలు అందుబాటులో ఉంచుకోవాలి. ఎవరు, ఎందుకు ఇచ్చారో ఆధారాలు ఉండాలి.

### విద్యా సంస్థల్లో ఫీజులు

పిల్లలు చదువుల కోసం సంబంధిత పాఠశాల, కళాశాలల యాజమాన్యాలకు ఫీజులు చెల్లించాలంటే నగదు తీసుకుని వెళ్లలక తప్పదు. ఆటువంటి సమయంలో సంబంధిత కళాశాల యాజమాన్యాలు ఇచ్చిన రసీదు తప్పకుండా ఉండాలి. నగదు చెల్లించకముందు ఫీజు కట్టాలనే నోటీసులు వెంట ఉంచుకోవాలి. అవసరమైతే ఆన్‌లైన్‌లో ఫీజులు చెల్లించడం మంచిది.

### ఆసుపత్రుల బిల్లులకు...

అత్యవసర సమయాల్లో అధిక మొత్తంలో ఆసుపత్రి బిల్లులు చెల్లించక తప్పదు. ఆటువంటి సమయంలో రోగి మెడికల్ కేస్ షీట్, మెడికల్ సర్టిఫికెట్, ఆసుప్రతి బిల్లులు అందుబాటులో ఉంచుకోవాలి.

## మొదలయ్యాయి



● తొలి రోజు స్వల్ప సంఖ్యలో నామినేషన్లు

**విజయనగరం రూరల్:** విజయనగరం నియోజకవర్గానికి సంబంధించి తొలి రోజు గురువారం రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. పి.కరుణాకర్ (సమాజ్‌వాదీ పార్టీ), మండల శ్రీనివాసరావు (స్వతంత్ర అభ్యర్థి) నామినేషన్ దాఖలు చేశారు. ఈ నామినేషన్లను ఆర్‌డీఓ కార్తీక్ స్వీకరించారు. రెండో రోజు శుక్రవారం ఏకాదశి... మంచి రోజు కావడంతో ఎక్కువ నామినేషన్లు దాఖలయ్యే అవకాశం ఉంది.

### బొబ్బిలిలో..

**బొబ్బిలి:** బొబ్బిలి అసెంబ్లీ స్థానానికి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసేందుకు గురువారం తొలిరోజు ఒక అభ్యర్థి రెండు సెట్ల నామినేషన్ దాఖలు చేశారు. ముగడ వెంకటరమణ కాంగ్రెస్ పార్టీ తరఫున ఒకటి, ఇండిపెండెంట్‌గా మరొక నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ ఎ.సాయిశ్రీకి అందజేశారు. డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐలు మలిరెడ్డి నాగేశ్వరరావు, తిరుమలరావుల ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

### ఎమ్మెల్యే బడ్డుకొండ...

**నెల్లిమర్ల:** నెల్లిమర్ల నియోజక వర్గ వైసీపీ ఎంఎల్ఏ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు గురువారం నామినేషన్ దాఖలుచేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి ఎం.నూకరాజుకు మూడు సెట్ల నామినేషన్ పత్రాలను బడ్డుకొండ సమర్పించారు.

### స్వతంత్ర అభ్యర్థిగా నిమ్మక జయరాజ్...

**కురుపాం:** కురుపాం(షె.తె.)అసెంబ్లీ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా మొట్టమొదటి నామినేషన్ మాజీ ఎమ్మెల్యే నిమ్మక జయరాజ్ దాఖలు చేశారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.వెంకట రమణకు గురువారం ఆయన నామినేషన్ పత్రాలను అందజేశారు.

### ఎస్.కోటలో రెండు...

**శృంగవరపుకోట:** శృంగవరపుకోట శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు గురువారం రెండు నామినేషన్లు దాఖలయ్యాయని రిటర్నింగ్ అధికారి మురళీకృష్ణ తెలిపారు. ఎస్.కోట మండలం శివరామ రాజుపేటకు చెందిన కోట్యాడ లోకాభి రామకోటి స్వతంత్ర అభ్యర్థిగా... కొత్తవలస మండలం కంటకాపల్లి శివారు కొత్తూరు గ్రామానికి చెందిన యల్ల వెంకటరావు జాతీయ జనసేన పార్టీ తరఫున నామినేషన్లు అందించారని చెప్పారు.

### నేడు కూటమి ఎంపీ అభ్యర్థి కలిశెట్టి నామినేషన్

**విజయనగరం రూరల్:** టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి విజయనగరం ఎంపీ అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు శుక్రవారం ఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్‌లోని ఎన్నికల విభాగం సెల్‌లో నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఏకాదశి... మంచి రోజు కావడంతో జ్యోతిష్యులు నిర్ణయించిన ముహూర్తం ప్రకారం ఆయన నామినేషన్ దాఖలు చేయనున్నారు. విజయనగరం పార్టీ కార్యాలయం (అశోక్ బంగ్లా) నుంచి కలెక్టరేట్ వరకూ టీడీపీ శ్రేణులతో ర్యాలీగా వెళ్లి... నామినేషన్ దాఖలు చేస్తారు.

● విజయనగరం నియోజకవర్గ ఎన్‌డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా అదితి గజపతిరాజు ఈ నెల 24న నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఉదయం 8 గంటలకు కోట వద్ద నుంచి టీడీపీ శ్రేణులు ర్యాలీగా ఆమె వెంట నడవనున్నారు. మూడులాంతర్ల వద్దనున్న పైడిమాంబ చదురుగుడి వద్ద అదితి గజపతిరాజుతో పాటు, టీడీపీ నాయకులు ఆ రోజు ప్రత్యేక పూజలు చేయనున్నారు. అనంతరం నామినేషన్ దాఖలు చేస్తారు.

### 24న కోళ్ల లలిత కుమారి..

**శృంగవరపుకోట:** శృంగవరపుకోట శాసన సభ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కోళ్ల లలిత కుమారి ఈనెల 24న నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ మేరకు మూహూర్తం నిర్ణయించారు. తొలుత ఈనెల 22న నామినేషన్ వేయాలని అనుకున్నారు. ఈ నెల 21న సాయంత్రం టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారానికి వస్తున్నారు. రాత్రి ఇక్కడ బస చేసే అవకాశం ఉంది. మరుసటి రోజు తిరిగి ప్రయాణమయ్యే వరకు చంద్రబాబు నాయుడుతో పాటు ఉండాలి. దీంతో ముహూర్తాన్ని మార్పు చేశారు. వైసీపీ అభ్యర్థి కడుబండి శ్రీనివాసరావు శుక్రవారం ఉదయం 10.59 గంటలకు నామినేషన్ సమర్పించనున్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి.

పాలకొండ నియోజకవర్గ పరిధిలో గల భామిని, సీతంపేట మండలాల్లోని గిరిజన ప్రాంతాల అభివృద్ధికి స్థానిక ప్రజాప్రతినిధి ఇచ్చిన హామీ ఒక్కటీ నెరవేరలేదని ఆ మండల వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల ముందు పర్యటించిన ఆ ప్రజాప్రతినిధి చెప్పిన వాటిలో.. ఐదేళ్లలో చేసిందేమీ లేదని మండిపడుతున్నారు. ఇప్పుడు మళ్లీ ఎన్నికలకు సిద్ధమవుతున్న తరుణంలో ఆ హామీలు ఓసారి చూద్దాం.

# మరచిపోయారో.. మారిపోయారో!

- కార్యరూపం దాల్చని హామీలు
- ప్రజాప్రతినిధి పనితీరుపై పెదవి విరుపు



అభివృద్ధికి దూరంగా మిగిలిపోయిన భాజీపురం గ్రామం

(భామిని)

గత ఎన్నికల్లో వైసీపీ తరపున గెలుపొందిన ప్రజాప్రతినిధి ఇచ్చిన హామీలు నీటిమూటలుగా మిగిలాయి. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని పార్వతీపురం మన్యం జిల్లా భామిని మండల ప్రజలు నిట్టూరుస్తున్నారు.


● మండలానికి డిగ్రీ కళాశాల, మహిళా జూనియర్ కళాశాల, గిరిజన ప్రాంతాల్లో పక్కా గృహాలు, గ్రామాల అభివృద్ధి, నేరడి బ్యారేజ్ నిర్మాణంతో తాగు నీరు అందిస్తామన్న హామీలన్నీ నీటిమూటలుగా మిగిలాయి. కొండ ప్రాంతాల్లో ఈ ఐదేళ్లలో తమకు రావాల్సిన పథకాలకు మంగళం పాడేశారని అంటున్నారు.

● గతంలో టీడీపీ ప్రభుత్వం మనుమకొండ, వడ్డంగి, పాలవలస లిఫ్ట్ ఇరిగేషన్ మంజూరు చేసింది. వంశధార నది నుంచి నీటిని తరలించేందుకు ప్రజాప్రతినిధి కనీసం దృష్టి సారించలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● నేరడి బ్యారేజ్ నిర్మాణం పూర్తి చేస్తామని భరోసా ఇచ్చారు. అదే సమయంలో నీటి పారుదల శాఖ మంత్రులుగా పనిచేసిన ఇద్దరు వేర్వేరుగా నేరడి బ్యారేజ్‌ను పరిశీలించి అంచనాలు వేసి రైతులకు సాగునీరు అందించడమే ధ్యేయమని వాగ్దానాలు చేశారు. ఇవి కూడా నెరవేరలేదు. కొండలోవగెడ్డ రిజర్వాయర్ నిర్మాణం పూర్తి చేయలేదు. ఏ గ్రామం వెళ్లినా సమస్యలే కనిపిస్తున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు.



నేరడి బ్యారేజ్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న మంత్రి తదితరులు (ఫైల్)



## రోడ్డన్నారు.. కల్వర్టులు వేస్తామన్నారు

- ఒక్కటీ నెరవేరని వైనం
- ఆందోళనలో గిరిజనలు



తాగునీరు, రహదారులకు నోచుకోని మూలగూడ గిరిజన గ్రామం

(సీతంపేట)

మండలంలోని మారుమూల పంచాయతీ పరిధిలో ఉన్న మూలగూడ, బెనరాయి గ్రామాల్లో గత ఎన్నికల్లో ప్రజాప్రతినిధులు తమకు ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా అమలు కాలేదని ఆదివాసీలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

● మర్రిపాడు నుంచి కొత్తగా ఏర్పడిన బెనరాయి పంచాయతీ పరిధిలో ఉన్న బెనరాయి, మేడి ఒప్పంగి మధ్య అనుసంధాన రహదారి... గ్రామాల్లో గెడ్డ వద్ద కల్వర్టులు కడతామని... ఈతమానుగూడలో 200 మీటర్ల వరద గోడ మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

● బెనరాయిలో వంద మీటర్ల వరదగోడ మంజూరు చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చినప్పటికీ ఇంతవరకు పూర్తి కాలేదని బెనరాయికి చెందిన మాజీ సర్పంచ్ సవర బాపయ్య స్పష్టం చేశారు.

● మర్రిపాడు పంచాయతీ పరిధిలో ఉన్న మూలగూడ గ్రామంలో 120 మంది గిరిజన జనాభా ఉన్నారు. 70 మంది ఓటర్లను కలిగి ఉన్న ఈ గ్రామంలో సీసీ రహదారి, తాగునీరు, వరదగోడలు మంజూరు చేస్తామని గతంలో హామీనిచ్చిప్పటికీ ఇంతవరకు నెరవేర్చలేదని, ప్రస్తుతం తాగునీటికి తీవ్రంగా ఇబ్బంది పడుతున్నట్టు ఆ గ్రామానికి చెందిన సవర జమ్మయ్య స్పష్టం చేశారు. తమ గ్రామాలు కమ్యూనిస్టు పార్టీకి అనుకూలంగా ఉండడం వల్లనే అభివృద్ధి జరగడం లేదని ఆదివాసీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### హామీలు మరిచారు



గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు పాలకులు మరిచిపోయారు. ఒక్కటి కూడా అమలు చేయ లేదు. దీంతో మా గ్రామం అభివృద్ధికి ఆమడ దూరంగానే మిగిలిపోయింది.

- సవర సుగన్న, మాజీ సర్పంచ్, బెనరాయి

### తాగునీటికి ఇబ్బంది



గత ఎన్నికల్లో ప్రచారానికి వచ్చిన నాయకులు గెలిచిన తర్వాత ఒక్క హామీ కూడా నెరవేర్చలేదు. మా గ్రామంలో తాగు నీటి సమస్య తీరుస్తామని, వరదగోడలు కడతామని... రహదారి నిర్మిస్తామని ఇచ్చిన హామీలేవీ నేటికీ నెరవేర్చలేదు.

- సవర జమ్మయ్య, మూలగూడ


## అరకు పార్లమెంటు పరిధిలో మన ఓటర్లు ఎందరంటే..

(పార్వతీపురం, ఆంధ్రజ్యోతి)

అరకు పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలో 2024 జనవరి 22న విడుదల చేసిన తుది ఓటర్ల జాబితా మేరకు పార్వతీపురం మన్యం జిల్లాలో 7,75,598 మంది ఉండగా.. అందులో పాలకొండ ఎస్టీ నియోజకవర్గంలో 94,328 మంది పురుషులు, 99,325 మంది మహిళలు, 14 మంది థర్డ్‌జెండర్..వెరసి 1,93,667 మంది ఓటర్లు ఉన్నారు. కురుపాం ఎస్టీ నియోజకవర్గంలో 93,592 మంది పురుషులు, 99,005 మంది మహిళలు, 39 మంది థర్డ్‌జెండర్... వెరసి 1,92,636 మంది ఓటర్లు ఉన్నారు. పార్వతీపురం ఎస్సీ నియోజకవర్గంలో 92,655 మంది పురుషులు, 95,188 మంది మహిళలు, 11 మంది థర్డ్‌జెండర్ వెరసి 1,87,854 మంది ఓటర్లు ఉన్నారు. సాలూరు ఎస్టీ నియోజకవర్గంలో 98, 189 మంది పురుషులు, 1,03,248 మహిళలు, నలుగురు థర్డ్ జెండర్ వెరసి 2,01,441 మంది ఓటర్లు ఉన్నారు.

**పోలింగ్ కేంద్రాల వివరాలు..**

పార్వతీపురం మన్యం జిల్లాలో మొత్తం 1031 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. పాలకొండ నియోజకవర్గంలో 287, కురుపాంలో 268, పార్వతీపురంలో 233, సాలూరులో 243 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి.




## తుపాకులు ఇచ్చేశారు!

- ఎన్నికల వేళ పోలీసులు అప్రమత్తం

(విజయనగరం క్రైం)

సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఈసీ నిబంధనల ప్రకారం పోలీసులు అప్రమత్తమయ్యారు. తుపాకీ లైసెన్స్‌లు కలవారంతా ఎన్నికల ప్రక్రియ ముగిసేవరకూ తమకు ఆ యుధాలను అందజేయాలంటూ పోలీసులు వారికి లేఖలు రాశారు. ఆమేరకు సంబంధిత వ్యక్తులు తుపాకులను పోలీసులకు అప్పగించేశారు. ఎప్పుడు సార్వత్రిక ఎన్నికలు జరిగినా... ఈ ప్రక్రియను పోలీసులు పూర్తి చేయడం ఆనవాయితీ. స్వీయ రక్షణ కోసం తుపాకీ కావాలంటూ కొందరు వ్యక్తులు పోలీసుశాఖకు దరఖాస్తు చేస్తారు. పోలీసులు సమగ్ర విచారణ చేపట్టి.. ప్రవర్తన తదితర వాటిని స్థానిక పోలీసులతో పాటు, స్పెషల్ బ్రాంచ్ ద్వారా విచారణ చేపట్టి.. అర్హుడైతే తుపాకుల లైసెన్స్ ఇస్తారు. ఇలా లైసెన్సు జారీ చేసినప్పుడు...పోలీసులు కొన్ని షరతులు పెడతారు. తాము అడిగినప్పుడు... ప్రత్యేక సందర్భాల్లో తిరిగి తుపాకిని తమకు స్వాధీనపరచాలన్న నిబంధన విధిస్తారు. ఈ నిబంధన పత్రం మీద ఆ వ్యక్తి సంతకం చేస్తారు. విజయనగరం జిల్లాలో ఎస్‌బీఎల్, డీబీబీఎల్, పిస్టల్, రైఫిల్స్ మొత్తం 445 ఉన్నాయి. వీటిలో ఈ నెల 17వ తేదీ నాటికి 68 మినహా మిగతా అన్ని పోలీసు శాఖ స్వాధీనం చేసుకుంది. 68లో ఎనిమిదింటిని హైకోర్టులో కేసులు ఉన్న కారణంగా అప్పగించలేదు. 60 తుపాకులు బ్యాంకు సిబ్బంది ఆధీనంలో ఉన్నాయి.



## బైండోవర్లు కీలకం

- 14,344 బైండోవర్ కేసులు
- 111 మంది రౌడీ షీటర్లు



కౌన్సిలింగ్ చేస్తున్న పోలీసులు

**విజయనగరం క్రైం:** జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు వీలుగా... అల్లరిమూకలు, పాత నేరస్థులు తదితరులపై పోలీసులు దృష్టి పెట్టారు. ఎన్నికల షెడ్యూల్ వచ్చింది మొదలు సంబంధిత స్టేషన్ ఆఫీసర్ల పర్యవేక్షణలో బైండోవర్ కేసుల నమోదు ప్రక్రియను ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా 14,344 మందిని బైండోవర్ చేశారు. విజయనగరం జిల్లాలో గల ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోని 33 స్టేషన్‌ల పరిధిలో 14,344 మందిపై బైండోవర్ కేసులు నమో దయ్యాయి. పాత నేరస్థులకు సంబంధించి 111 మంది పై రౌడీషీట్లు తెరిచారు. వీరందరికీ ఇప్పటికే పోలీసు స్టేషన్లకు రప్పించి...కౌన్సిలింగ్ చేశారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు సహకరిం చాలని... ఇబ్బంది కలిగిస్తే అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. విజయనగరం జిల్లాలో 14,344 బైండోవర్ కేసులకు సంబంధించి అధికార వైసీపీపై 7,980, టీడీపీ 7,511, జనసేన 526, ఇతరులు 296 మందిపై నమోదు చేశారు. వీరితో పాటు, రౌడీ షీటర్లకు సంబంధించి 111 మందిని గుర్తించారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకూ క్షేత్రస్థాయిలో ఉన్న సచివాలయ పోలీసులతో పాటు, స్థానిక పోలీసులు ఎప్పటికప్పుడు వీరిపై నిఘా ఉంచుతారు. అల్లర్లకు పాల్పడితే వెంటనే వీరిని అదుపులోకి తీసుకుంటారు.

## ‘లెక్క’ తేలుస్తారు!

- జిల్లాకు చేరుకున్న వ్యయ పరిశీలకులు




వ్యయ పరిశీలకులతో కలెక్టర్, ఎస్పీ

**కలెక్టరేట్:** ఎన్నికల వ్యయ పరిశీలకులు ప్రభాకర్ ప్రకాష్ రాజన్, ఆనంద్ కుమార్, ఆకాష్ దీప్ గురువారం సాయంత్రం జిల్లాకు చేరుకున్నారు. వీరిని జెడ్పీ అతిథి గృహం వద్ద కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ దీపికా పాటిల్ మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో ఎన్నికల పరిస్థితిని... తీసుకుంటున్న చర్యలను వివరించారు. వీరి వెంట లైజన్ అధికారులు ఉన్నారు.

## టీడీపీ సానుభూతిపరులని.. రోడ్డు వేయలే!

- మంజూరైన నిధుల మళ్లింపు
- ఐదేళ్లుగా ఆ కాలనీ వాసుల అవస్థలు

**గజపతినగరం:** రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందిస్తున్నామని చెబుతున్న అధికార పార్టీ వైసీపీ నాయకుల వివక్షకు ఈ ఘటన ఉదాహరణగా నిలుస్తుంది. టీడీపీ హయాంలో పురిటిపెంట పంచాయతీ రైల్వే కాలనీ మీదుగా రైల్వే స్టేషన్‌కు వెళ్లే రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. అనంతరం ఎన్నికలు రావడంతో వైసీపీ అధికారంలోకి వచ్చింది. ఆ తర్వాత ఈ రోడ్డు నిర్మాణం సంగతి పట్టించుకోలేదు. ఈ రోడ్డు మార్గంలో కాలనీ అంతా టీడీపీదే ఆధిపత్యం అని వచ్చిన నిధులను వైసీపీ నాయకులు వేరొక వైపు మళ్లించేశారని ఆ కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. స్థానిక రైల్వేస్టేషన్‌కు వెళ్లే రోడ్డు శిథిలావస్థకు చేరుకోవడంతో రాకపోకలకు ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. గజపతినగరంతో పాటు బొండపల్లి, మెంటాడ మండలాలకు చెందిన వందలాది మంది ప్రయాణికులు ఈ రోడ్డుపైనే రాకపోకలు సాగిస్తున్నారు. రోడ్డు గోతుల మయమైపోవడంతో రాత్రి సమయాల్లో ప్రమాదాలకు గురవుతున్నామని ప్రయాణికులతో పాటు స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రోడ్డు మరమ్మతు పనులతో పాటు డ్రైనేజీ నిర్మాణానికి రూ.15 లక్షలు అప్పటి ఎమ్మెల్యే కేఏ నాయుడు మంజూరు చేశారు. పనులు ప్రారం భించే సమయానికి ఎన్నికల కోడ్ రావడంతో చేపట్టలేదు. ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టి ఐదేళ్లు గడుస్తున్నా ఇంతవరకు ఈ రోడ్డు సమస్య పరిష్కారం కావడం లేదు. టీడీపీ ప్రభుత్వం హయాంలో మంజూరైన నిధులతో స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి పాత ఎంపీడీవో కార్యాలయం వరకు రోడ్డు వేసి ఖర్చు చేశారు. రైల్వే కాలనీలో అంతా టీడీపీ సానుభూతిపరులు కావడంతో ఇక్కడి నిధులను ప్రస్తుత ఎమ్మెల్యే మళ్లించారని స్థానికులు ఆరోపిస్తున్నారు. వైసీపీ ప్రభుత్వం మారితే తమ రోడ్డు పరిస్థితి మారుతుందని స్థానికులతో పాటు ప్రయాణికులు ఆశా భావం వ్యక్తం చేస్తున్నారు.



రైల్వేస్టేషన్‌కు వెళ్లే రోడ్డు దుస్థితి

## అటువైపు వెళ్లొద్దు

- కలెక్టరేట్ నిర్మానుష్యం
- ఎవరినీ అనుమతించని వైనం
- బారికేడ్లు వేసి నియంత్రణ
- నామినేషన్ల స్వీకరణ ఫలితం

ఈ చిత్రం చూశారా? నిత్యం జనాలతో కళకళలాడే విజయనగరం కలెక్టరేట్ ఎలా బోసిపోయిందో... ఇదేదో ఎండల తీవ్రత వల్ల అనుకుంటున్నారా? కాదు..ఎన్నికల వేడి వల్ల. కలెక్టరేట్‌లో పార్లమెంట్ అభ్యర్థుల నామినేషన్లను స్వీకరించే కార్యక్రమం ప్రారంభమైంది. దీంతో భద్రతను కట్టుదిట్టం చేశారు. లోపలికి వాహనాలు, ప్రజలు వెళ్లకుండా బారికేడ్లు పెట్టారు. కలెక్టరేట్ ఉద్యోగులు... ముఖ్యంగా ఎన్నికల సిబ్బంది ఐడీ కార్డులను పరిశీలించి... కలెక్టరేట్ ప్రాంగణంలోకి విడిచి పెడుతున్నారు. సాధారణ ప్రజలకు ప్రవేశం లేదు. దీంతో కలెక్టరేట్ పరిసరాలు నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. మొత్తం ఈ ప్రాంతం పోలీసు వలయంలో ఉంది.

- విజయనగరం-ఆంధ్రజ్యోతి





పోలీసుల పహరా.. హెచ్చరిక బోర్డు



కలెక్టరేట్ ఆవరణ బోసిపోయిన దృశ్యం

## రిక్షా... మైకు... ఓ గుర్తు!

ఓల్డ్ ఈజ్ గోల్డ్

**పార్వతీపురం, ఆంధ్రజ్యోతి:** ఎన్నికలు వస్తే పల్లెల్లో సందడి అంతాఇంతా కాదు. ఇప్పుడైతే రకరకాల ప్రచార సాధనాలు వచ్చాయి గానీ.. ఒకప్పుడు... అంటే దాదాపు నాలుగు దశాబ్దాల కిందట ప్రధాన ప్రచార వాహనం రిక్షానే. జనతా పార్టీ... జాతీయ కాంగ్రెస్, కాంగ్రెస్ ఎస్ తదితర జాతీయ పార్టీల అభ్యర్థులు బరిలో ఉండేవారు. అప్పట్లో రిక్షాలపై మైక్‌లతో ప్రచారం చేసేవారు. ‘ఆవుదూడకే మన ఓటు... హస్తం గుర్తుకే మీ ఓటు... రాట్నం గుర్తుకే మన ఓటు... నాగలి పట్టిన రైతు గుర్తుకే మన ఓటు...’ అంటూ ప్రచారం చేసేవారు. ఈ ప్రచారం ఎక్కువగా రిక్షాలపై సాగేది. రిక్షాలకు పోస్టర్లు అతికించి...ఓ వ్యక్తి వాటిలో కూర్చొని... మైకులో ప్రచారం చేసేవారు. అప్పట్లో జీపులపైనే అభ్యర్థులు ప్రచారానికి ఊరూరా తిరిగేవారు. జీపుల్లో ప్రచారానికి అభ్యర్థులు వస్తే వారి వెంట పిల్లలు పరుగులు పెట్టేవారు.



## కల్వర్టును ఢీకొన్న జీపు

● మహిళ మృతి ● పది మందికి గాయాలు



కురుపాం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

కురుపాం రూరల్/ కురుపాం/ గుమ్మ లక్ష్మీపురం: కురుపాం మండలం రస్తాకుంటుబాయి వద్ద జీపు అదుపు తప్పి కల్వర్టుకు ఢీ కొనడంతో ఒక మహిళ అక్కడికక్కడ మృతి చెందగా, పది మందికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు, గ్రామస్థులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. గురువారం మధ్యాహ్నం కురుపాం మండలంలోగల పి.లేవిడి, కాకితాడ గ్రామాల నుంచి కొందరు కొమరాడ మండలం పూడేసు శుభకార్యానికి జీపులో వెళ్తున్నారు. జీపు రస్తాకుంటుబాయి వద్దకు వచ్చేసరికి అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న కల్వర్టుకు ఢీకొంది. దీంతో జీపులో ప్రయాణిస్తున్న పి.లేవిడికి గ్రామానికి చెందిన కిమిడి కమలమ్మ(55) అక్కడికక్కడ మృతిచెందింది. పలువురికి గాయాలయ్యాయి. వీరిలో పి.లేవిడకి చెందిన బొమ్మన సుగుణ, పెద్దింటి బుజంగరావు, సుజాత, పాలక శశిరేక, నిమ్మక సుమన్, కాకితాడకు చెందిన గంటా పవన్, నేమలపురి తేజకు కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రం తరలించారు. వైద్యురాలు శోభరాణి, సిబ్బంది ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించారు. అలాగే గాయపడిన సుగుణ, చైతన్య, శశిరేఖను భద్రగిరి ఆసుపత్రిలో ప్రథమ చికిత్స నిర్వహించి, మెరుగైన వైద్యం కోసం విజయనగరం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కురుపాం ఎస్‌ఐ షణ్ముకరావు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

## పురుగు మందు తాగి ఆత్మహత్య

లక్కవరపుకోట: మండలంలో సోంపురం కూడలికి దగ్గరలో ఒక వ్యక్తి పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్టు ఎస్‌ఐ గోపాలరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తవలస చింతల దిమ్మకు చెందిన పాకలపాటి శ్రీనివాసరాజు(47)పై కొద్దిరోజుల కిందట బాలికపై అత్యాచార ఘటనలో పోక్సో కేసు నమోదైంది. దీంతో పోలీసులకు దొరకకుండా పరారీలో ఉన్న శ్రీనివాసరాజు గురువారం సోంపురం కూడలికి దగ్గరలో శవమై కనిపించాడు. పొలంపని చేసుకుంటున్న రైతుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. పోక్సో కేసు నమోదైందన్న కారణంతో తీవ్ర మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడినట్టు ఎస్‌ఐ పేర్కొన్నారు. మృతుని తల్లి పార్వతమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బాడంగి: పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి ఎస్‌ఐ జయంతి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలో చినభీమవరం గ్రామానికి చెందిన ఉయ్యాల నూకందొర (51) మద్యం, పేకాటకు బానిసై గ్రామంలో రూ.3 లక్షల వరకు అప్పు చేశాడు. అప్పుల భారం పెరగడం, అప్పు తీర్చేందుకు అవకాశం లేకపోవడంతో ఈ నెల 16న ఉదయం పురుగుల మందు తాగి ఇంటికి వచ్చి వాంతులు చేసుకున్నాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు నూకందొరను స్థానిక పీహెచ్‌సీకి తరలించగా అక్కడి నుంచి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయనగరం సర్వజన ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ 17వ తేదీ రాత్రి మృతిచెందాడు. దీనిపై మృతుడి భార్య పద్మావతి ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

## వ్యక్తిపై కత్తితో దాడి.. కేసు నమోదు

వేపాడ: వ్యక్తిపై కత్తితో దాడి చేసి పీక కోసిన ఘటన మండలంలో గురువారం చోటుచేసుకుంది. దీనికి సంబంధించి వల్లంపూడి ఎస్‌ఐ రాజేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని వావిలపాడు గ్రామంలో కొచ్చెర్ల సన్యాసిరావు, ఆరిపాక సంతోష్ ఇరుగుపొరుగు ఇళ్లలోనే నివసిస్తున్నారు. ఇద్దరూ సరదాగా, సన్నిహితంగా ఉండేవారు. ఈ క్రమంలో ఎప్పటిలాగే గురువారం ఉదయం సన్యాసి రావు ఇంట్లోకి సంతోష్ వెళ్లి.. మాట్లాడుతూ ఉన్నట్టుండి సన్యాసిరావు పీకపై కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. దీంతో సన్యాసిరావు ఒక్కసారిగా కుప్పకూలి పోయాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు క్షతగాత్రుడిని తక్షణమే కే.కోటపాడు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు చికిత్స అందించగా ఆస్పత్రిలోనే ఉన్నాడు. దాడికి పాల్పడిన ఆరిపాక సంతోష్ వల్లంపూడి పోలీస్ స్టేషన్‌కు వచ్చి లొంగిపోయాడు. పోలీసులు సంతోష్‌ను అదుపులోకి తీసుకోవడంతో పాటు కేసు నమోదు చేశారు.

## నిబంధనలు పాటించాల్సిందే..

● డీఎస్పీ మురళీధర్



సిబ్బందికి ఆదేశాలు ఇస్తున్న డీఎస్పీ మురళీధర్

సాలూరు: ఎన్నికల నేపథ్యంలో ప్రతిఒక్కరూ విధిగా నిబంధనలు పాటించాలని డీఎస్పీ మురళీ ఆదేశించారు. గురువారం నామినేషన్లకు నోటిఫికేషన్ విడుదల వడంతో పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట వంద మీటర్ల వరకు పోలీసుల ఆధ్వర్యంలో బారికేడ్లు ఏర్పాటు చేశారు. వాటిని పరిశీలించిన డీఎస్పీ అక్కడున్న సిబ్బందికి పలు సూచనలిచ్చారు. వంద మీటర్ల పరిధిలో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు షాపులకు అనుమతి లేదని ఆయన తెలిపారు. ఎలాంటి అవంఛనీయ సంఘటనలు జరగకుండా తహసీల్దార్ కార్యాలయం వద్ద పటిష్ట భద్రత ఏర్పాట్లు చేశామన్నారు. కాగా తొలిరోజు ఎలాంటి నామినేషన్లు పడలేదని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి సింహాచలం తెలిపారు.

## దోనుబాయి వైద్యాధికారిపై విచారణ



విచారణ నిర్వహిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో శివకుమార్

సీతంపేట: దోనుబాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి భానుప్రతాప్‌పై డిప్యూటీ డీఎంహెచ్‌వో శివకుమార్ గురువారం విచారణ చేపట్టారు. ఇటీవల దోనుబాయి ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఆయనపై ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు డిప్యూటీ డీఎంహెచ్‌వో విచారణ చేపట్టారు. సిబ్బంది ఆరోపణలపై సమగ్రంగా విచారణ జరిపి కలెక్టర్‌కు, డీఎంహెచ్‌వోకు అందిజేస్తానని ఆయన తెలిపారు.

## వరికుప్ప దగ్ధం

మక్కువ: మండలంలోని శంబర గ్రామంలో తీల్ల నరసింహం అనే వ్యక్తికి చెందిన వరి గడ్డి కుప్ప గురువారం దగ్ధమయ్యింది. అప్రమత్తమైన స్థానికులు సాలూరు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వెంటనే వారు వచ్చి మంటలను అదుపు చేశారు.



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

# మూణ్నాళ్ల ముచ్చటే..

● ఆర్ఆర్‌బీ పురం గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో మూలకు చేరిన మినరల్ వాటర్ ప్లాంట్లు
● అవస్థలు పడుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

(జియ్యమ్మవలస)

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పిల్లల సౌకర్యార్థం లక్షలాది రూపాయలు వెచ్చించి ఏర్పాటుచేసిన మినరల్ వాటర్ ప్లాంట్లు మూలన చేరాయి. దీంతో గిరిజన విద్యార్థులు కొంత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలో అలమండ పంచాయతీ రావాడ రామభద్రపురం గ్రామంలో ఉన్న గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలలో పరిస్థితే ఇందుకు ప్రత్యక్ష నిదర్శనం. ఈ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో 161 మంది బాలురు విద్యనభ్యసిస్తున్నారు. వీరి కోసం ఐదేళ్ల కిందట లక్షలాది రూపాయలు ఐటీడీఏ నిధులతో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్ మూలన చేరింది. దీని పరిస్థితి ఎలా ఉందో చూడాల్సిన టెక్నీషియన్లు కనీసం ఇటువైపు చూడటం మానేశారు. ఫలితంగా ఆ వాటర్ ప్లాంట్ పాఠశాలలో ఒక గదిలో దిష్టి బొమ్మలా మిగిలిపోయింది. ఇది కాకుండా నాడు-నేడు పథకం ద్వారా ఏడాది క్రితం రూ.3లక్షలతో మరో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. ఇది మూణ్నాళ్ల ముచ్చటగానే తయారయ్యింది. ఏర్పాటు చేసిన తర్వాత ఆరు నెలలే నీరందించింది. కానీ ఇదీ కూడా ఎందుకు పనికి రాకుండాపోయింది. దీనిపై నాడు - నేడు యాప్‌లో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరిసిపిల్లి తిరుపతిరావు ఫిర్యాదు అప్‌లోడ్ చేసినా ఇంతవరకు ఎవరూ పట్టించుకోలేదని తెలిసింది. దీంతో పాఠశాల విద్యార్థులు ట్యాప్‌ల ద్వారా వస్తున్న నీటినే తాగునీరుగా వాడుతున్నారు. దీనికి సంబంధించి మోటారు వద్ద లీకుల ద్వారా కొంత నీరు వృథాగా పోతోంది. మినరల్ వాటర్ ప్లాంటు ఉన్నప్పటికీ తమకెందుకు ఈ దుస్థితి అంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా త్వరగా మరమ్మతులు చేయించి స్వచ్ఛమైన నీటిని అందించాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. మినరల్ వాటర్ ప్లాంటు పాడైపోతే దాని కోసం తెలిసిన టెక్నీషియన్లను మరమ్మతు చేయడానికి పంపిస్తే బాగుంటుంది గానీ స్థానికంగా ఉంటున్న ప్రైవేటు వ్యక్తులతో మరమ్మతులు చేయిస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు. దీనిపై ఐటీడీఏ ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవలసి ఉంది.



రావాడ రామభద్రపురం ఆశ్రమ పాఠశాలలో నిరుపయోగంగా ఉన్న వాటర్ ప్లాంటు

### ఫిర్యాదు చేశాం

పాఠశాల ఆవరణలో ఉన్న మినరల్ వాటర్ ప్లాంట్లు మరమ్మతుకు గురయ్యిందని నాడు - నేడు యాప్‌లో ఫిర్యాదు చేశాం. కానీ ఇంతవరకు ఎవరూ రాలేదు.

- ఎన్.తిరుపతిరావు, హెచ్‌ఎం, టీడబ్ల్యూఏ హెచ్ స్కూల్, రావాడ రామభద్రపురం

## కూటమి అభ్యర్థుల ప్రచారం



ప్రచారంలో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు గీత, జగదీశ్వరి

గురుగుబిల్లి: ప్రజలతో మమేకమై పనిచేయడం తనకు ఎంతో ఇష్టమని కూటమి అరకు ఎంపీ అభ్యర్థి కొత్తపల్లి గీత అన్నారు. గురువారం ఉల్లిభద్ర జంక్షన్ నుంచి గిజబ గ్రామం వరకు భారీ బైకు ర్యాలీ నిర్వహించారు. కొత్తపల్లి గీత తోపాటు, కురుపాం ఎమ్మెల్యే అభ్యర్థి తోయక జగదీశ్వరి కలిసి ప్రచార రథంపై రోడ్‌షో చేశారు. జగదీశ్వరి మాట్లాడుతూ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని కోరారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్‌చంద్రదేవ్, టీడీపీ నాయకులు దత్తి లక్ష్మణరావు, ద్వారపురెడ్డి సత్యనారాయణ, బీజేపీ నాయకుడు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు, జనసేన నాయులు కద్రక మల్లేష్, టీడీపీ నాయకులు ఎం.పుష్పోత్తమునాయుడు, అంబటి రాంబాబు, కోట భరత్ కుమార్, జగదీష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ● ప్రచారానికి ముందుగా అభ్యర్థులు తోటపల్లిలో గల శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు.

## టీడీపీ వస్తేనే అభివృద్ధి: సంధ్యారాణి



ప్రచారం చేస్తున్న సంధ్యారాణి

సాలూరు రూరల్: టీడీపీ వస్తేనే అభివృద్ధి సాధ్యమని సాలూరు ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. కందులపథం పంచాయతీలో ఆమె గురువారం ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఆముదాల పరమేశు, శ్యాం, రమాదేవి, కనినబోయిన వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

### పాలకొండలో ఎన్నికల ప్రచారం

పాలకొండ: రానున్న ఎన్నికల్లో గ్లాసు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కూటమి నాయకులు కోరారు. మండలంలోని వెలగవాడ, సిరికొండ గ్రామాల్లో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో కూటమి నాయకులు తేజోవతి, కోట సంగంనాయుడు, సాయికుమార్, కుమార్‌రాజా, టంకాల దుర్గారావు, కాంతారావు, రాజా, బెవర శ్రీను, బంగారునాయుడు పాల్గొన్నారు.

## 4జీ పరికరాల పంపిణీలో నిర్లక్ష్యం తగదు

గుమ్మలక్ష్మీపురం: ఫోర్‌జీ పరికరాల సరఫరాలో నిర్లక్ష్యం తగదని బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్యదర్శి అలుగు వెంకటరావు ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. తయారీ సమస్యతో టీసీఎస్ సంస్థ నుంచి ఎంతో కాలంగా 4జీ పరికరాలు సరఫరా కావడం లేదని చెప్పారు. సాంకేతిక సమస్యలు అధిగమించ డానికి నోకియా, జీటీఈ వంటి సంస్థలను టీసీఎస్ సాయం కోరినట్టు వార్తలు వచ్చాయన్నారు. తాత్కాలికంగా వినియోగానికి ఐడియా నెట్‌వర్క్ వినియోగానికి బీఎస్ఎన్ఎల్‌కు అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీనిపై బీఎస్ఎన్ఎల్ స్పందించడం లేదని, కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు.

## టీడీపీలో భారీ చేరికలు



పార్టీలోకి చేరినవారిని ఆహ్వానిస్తున్న కూటమి అభ్యర్థి విజయచంద్ర

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: పార్వతీపురం పట్టణంలో 18 వార్డుకు చెందిన గొట్ల శివకేశ్వరరావు, చనమల శ్రీనివాస్ ఆధ్వర్యంలో 50 కుటుంబాలు గురువారం టీడీపీలో చేరాయి. వారికి కూటమి అభ్యర్థి విజయచంద్ర పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో చీకటి భద్రినారాయణ పాల్గొన్నారు. అదేవిధంగా 29వ వార్డు టీడీపీ నాయకుడు బత్తుల నారాయణరావు ఆధ్వర్యంలో 50 కుటుంబాలు టీడీపీలో చేరాయి. ఈ కార్యక్రమంలో పార్వతీపురం పట్టణానికి చెందిన కూటమి నాయకులు సింగ్‌మజ్జి కృష్ణమోహన్, నారాయణరావు, టీవీ రమణ, ఎం.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం రూరల్: పార్వతీపురం మండలంలో వైసీపీకి గట్టి షాక్ తగులు తూనే ఉంది. ఈనెల 17న మండలంలోని ఎంఆర్‌నగరం సర్పంచ్ వంగపండు లక్ష్మీతో పాటు ఉపసర్పంచ్ త్రినాథ్‌నాయుడు వారి అనుచరులతో టీడీపీలో చేరారు. తాజాగా సూడిగాం గ్రామ సర్పంచ్ పి.సూర్యనారాయణ తన అనుచరులతో టీడీపీ లో చేరారు. వీరిని కూటమి అభ్యర్థి విజయచంద్ర పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే లక్ష్మీనారాయణపురానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు ధనుంజయనాయుడు తన అనుచరులతో టీడీపీలో చేరారు.

### చినచాకల వీధిలో పలువురి చేరిక

వీరఘట్టం: మేజర్ పంచాయతీలోని చిన చాకలవీధిలో పలువురు వైసీపీ నాయకులు గురువారం టీడీపీలో చేరారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు జామి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో బల్ల హరిబాబు, తూముల రమేష్ సమక్షంలో వీరంతా పార్టీలో చేరారు. టీడీపీలో చేరిన వారిలో వెంపటాపు గోవింద, వెంపటాపు సింహాచలం, వెంపటాపు లక్ష్మణ, వెంపటాపు జగలి తదితరులు ఉన్నారు.

## వ్యయ పరిశీలకుడిని కలిసిన కలెక్టర్, ఎస్పీ



వ్యయ పరిశీలకుడికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎస్పీ, కలెక్టర్

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: జిల్లా పార్లమెంటరీ వ్యయ పరిశీలకుడిగా ఎన్నికల కమిషన్ నియమించిన గుర్‌కరుణ్‌సింగ్‌ను కలెక్టర్ నిశాంత్‌కుమార్, ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఉద్యానవన కళాశాల అతిథి గృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పార్లమెంటరీ వ్యయ పరిశీలకుడిగా గురువారం మన్యం జిల్లాకు చేరుకున్న సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛాన్ని అందించారు.

### ఇండియా కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా రమణ

జియ్యమ్మవలస: ఇండియా కూటమి కురుపాం ఎమ్మెల్యే అభ్యర్థిగా మండంగి రమణను ఎన్నికల్లో పోటీకి నిలబెడుతున్నట్టు రావాడ రామభద్రపురంలో విలేకర్ల సమావేశం ఏర్పాటుచేసి ప్రకటించారు. ఈసందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు కె.సుబ్బరావమ్మ మాట్లాడుతూ ఇండియా కూటమి అభ్యర్థి మండంగి రమణను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మథరావు, ఇండియా కూటమి అభ్యర్థి మండంగి రమణ, సీపీఎం నాయకులు కొల్లి గంగునాయుడు, సీతారాం, మర్రి సూర్యనారాయణ పాల్గొన్నారు.

## క్లుప్తంగా..

### అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక అధికారి పైడిరాజు

పార్వతీపురంటౌన్: అగ్ని ప్రమాదాల పట్ల జాగ్రత్తగా ఉండాలని పార్వతీపురం అగ్నిమాపక అధికారి పైడిరాజు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గురువారం పట్టణంలోని హెచ్‌పీ గ్యాస్ గొడౌన్ వద్ద మాక్‌డ్రిల్ నిర్వహించారు. గృహిణులు అగ్ని ప్రమాదాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. అగ్ని ప్రమాదం జరిగితే వెంటనే 101కు ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వాలని కోరారు.

### రోడ్డు భద్రతా చర్యలు పాటించండి



వాహనాలు తనిఖీ చేస్తున్న మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సిబ్బంది

సాలూరు: వాహనదారులు రోడ్డు భద్రతా చర్యలు పాటించకుంటే చర్యలు తప్పవని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జేవీఎస్ఎస్ ప్రసాద్ తెలిపారు. గురువారం ఆయన సాలూరు-మామిడిపల్లి రోడ్డులో వాహనాలు తనిఖీ నిర్వహించారు. రహదారి భద్రత పాటించని వాహ నాలను ఆయన గుర్తించారు. రహదారి భద్రతా చర్యలు పాటించకుండా వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

### నందగిరిలో పోలీసు కవాతు



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

మక్కువ: మండలంలోని నందగిరి గ్రామంలో ఎస్‌ఐ పి.నరసింహమూర్తి ఆధ్వర్యంలో సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా పోలీసుల కవాతును గురువారం నిర్వహించారు. ప్రశాంత ఎన్నికలు జరిగే ప్రజలు సహకరించాలని, గ్రామాల్లో ఎటువంటి వివాదాలు సృష్టించినా చర్యలు తప్పవన్నారు. సమస్యలుంటే తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

### మద్యం స్వాధీనం

మక్కువ: అక్రమంగా మద్యం తరలిస్తున్న తూరు మామిడి గ్రామానికి చెందిన వారణాసి శ్రీనివాసరావు నుంచి నాలుగు ఫుల్ బాటిళ్లు, ఏడు క్వార్టర్ బాటిళ్లు గురువారం స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ పి.నరసింహమూర్తి తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

## ఘనంగా శ్రీరామ పట్టాభిషేక మహోత్సవం

నెల్లిమర్ల: రామతీర్థం రామస్వామి దేవస్థానంలో గురువారం శ్రీరామ పట్టాభిషేక మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వసంత నవరాత్రుల ముగింపు సందర్భంగా శ్రీరామ నవమిని పురస్కరించుకుని బుధవారం సీతారాముల కల్యాణోత్సవం నిర్వహించిన సంగతి తెలిసిందే. గురువారం శ్రీరాముని పట్టాభిషేకం చేశారు. అలాగే శ్రీరాముని శిరస్సుపై బంగారు కిరీట ధారణ చేశారు. అంతకు ముందు యాగశాలలో పూర్ణాహుతి నిర్వహించారు. కలశలను ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. రామాయణంలోని పట్టాభిషేక సర్గ విన్నపం చేశారు. పంచామృతాలతో అభిషేకం చేశారు. ఈ కార్యక్రమాలను ఈవో వై.శ్రీనివాసరావు పర్యవేక్షించారు.



శ్రీరామ పట్టాభిషేక మహోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

## ఎండ తీవ్రత దృష్ట్యా జాగ్రత్తలు పాటించాలి

గుమ్మలక్ష్మీపురం: మన్యం జిల్లాలో ఎన్నడూ లేనంతగా ఈ ఏడాది ఎండల తీవ్రత అధికంగా ఉందని, ప్రజలు జాగ్రత్తలు పాటించాలని భద్రగిరి సీహెచ్‌సీ వైద్యుడు రవికుమార్ సూచించారు. ఈ మేరకు గురువారం ఆయన విలేకర్లతో మట్లాడారు. ఉదయం 11 గంటల్లోపు, సాయంత్రం నాలుగు గంటల నుంచి ఏడు గంటల మధ్య పనులు చేసుకోవడం మంచిదన్నారు. అత్యవసర సమయాల్లో మాత్రమే బయటకు రావాలని సూచించారు. ఎండలో ప్రయాణాలు చేసేవారు తలకు టోపీ, నీటిని అందుబాటులో ఉంచుకోవాలన్నారు. చిన్నారులు, వృద్ధులను ఇంటికే పరిమితం చేయాలని చెప్పారు. వడదెబ్బకు గురైతే చల్లని ప్రాంతానికి తీసుకెళ్లి చల్లటి తడిగుడ్డతో శరీరమంతా ఒత్తాలని సూచించారు. వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు.

## రేపు రెజ్లింగ్ జట్ల ఎంపిక పోటీలు

నెల్లిమర్ల: చిత్తూరు జిల్లాలో మే 3 నుంచి మూడు రోజుల పాటు జరగనున్న రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్ల ఎంపిక పోటీలు నెల్లిమర్ల మండలంలోని కొండగుంపాం గ్రామంలో శనివారం నిర్వహిస్తున్నట్టు జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.వెంకటరమణ, పి.లక్ష్మణరావు ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-17, అండర్-23 కేటగిరీల్లో ఎంపిక పోటీలు జరుగుతాయని చెప్పారు. అండర్-17కు 2009, 2010 సంవత్సరాల్లో జన్మించినవారు, అండర్-23 పోటీలకు 2002, 2003, 2004 సంవత్సరాల్లో జన్మించినవారు అర్హులని తెలిపారు. ఎంపిక పోటీలకు వచ్చే క్రీడాకారులు తమ ఒరిజినల్ ఆధార్ కార్డులు తీసుకురావాలని వారు సూచించారు.

## గ్యాస్ వాడకంపై అప్రమత్తంగా ఉండాలి

విజయనగరం క్రైం: గ్యాస్ వాడకంపై మహిళలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా అగ్నిమాపక సహాయ అధికారి సోమేశ్వరరావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గురువారం సింగపేర్ సిటీలో అపార్టమెంట్ నివాసితులకు వేసవి దృష్ట్యా గ్యాస్, విద్యుత్, ఆయిల్ అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సోమేశ్వరరావు మాట్లాడుతూ ఇంట్లో వంటలు చేసేటపుడు ఆయిల్ పదార్థాలు వంట స్టౌవ్‌పై పెట్టి మరిచిపోయినపుడు మంటలు వస్తాయన్నారు. వాటిని అదుపు చేయకపోతే అవి ఒంటిపైన, వంట గదిలో పడి మంటలు వ్యాపించి అగ్ని ప్రమాదాలకు దారితీస్తాయన్నారు.

## 22న గాజులరేగ ముత్యాలమ్మ పండుగ

విజయనగరం రూరల్: నగరంలోని ముత్యాల మ్మ పండుగ ఈ నెల 22న జరగనుంది. 22న తొలేళ్ల ఉత్సవం, 23న ప్రధాన పండుగ జరగనుంది. ఏటా ఉగాది అనంతరం జరిగే అమ్మవారి పండుగను గాజుల రేగ వాసులు ఎంతో భక్తిశ్రద్ధలతో భారీగా నిర్వహించనున్నారు. మేళతాళాలు, నేలవేషాలు సందడి చేయనున్నాయి. అదితి గజపతిరాజు, వైసీపీ అభ్యర్థి కోలగట్ల వీరభద్రస్వామి తదితరులు ఈ నెల 23న ముత్యాలమ్మవారిని దర్శించుకునే విధంగా ఏర్పాట్లు జరిగాయి. తమ, తమ నాయకులను రప్పించి, వారిచేత ప్రత్యేక పూజలు చేయించేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు.

### ప్రతి నెలా పైడిమాంబ ఆలయాల్లో చండీహోమాలు

విజయనగరం రూరల్: పైడిమాంబ దేవాలయాలు (మూడులాంతర్లు వద్ద వున్న చదురుగుడి, రైల్వే స్టేషన్ వద్ద ఉన్న వనంగుడి) వద్ద ప్రతి నెల పౌర్ణమి నాడు పైడిమాంబకు అత్యంత ప్రీతిపాత్రమైన చండీహోమాన్ని నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో ప్రసాద్‌రావు తెలిపారు. గతంలో కేవలం మూలా నక్షత్రం రోజున మాత్రమే చండీహోమాన్ని నిర్వహించే వారమని, భక్తులు, పురోహితులు సూచించిన మీదట ఉన్నతాధి కారులతో సంప్రదించి, ఇక ప్రతి నెల, ఆ నెలలో వచ్చే పౌర్ణమి రోజున చదురుగుడి, వనంగుడిలో చండీయాగం నిర్వహించడానికి నిర్ణయించామని చెప్పారు. భక్తులు పాల్గొని, అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు.

### 21న ఉచిత నేత్ర వైద్య శిబిరం

నెల్లిమర్ల: జరజాపుపేటలో ఈనెల 21న ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నారు. విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్, విజయనగరం జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో ఈ శిబిరం నిర్వహించనున్నట్టు సాధన యువజన సంఘం అధ్యక్షుడు పోలుబోతు దుర్గాప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.